క్లుప్తంగా

దశభుజ మహా గణపతికి విశేష పూజలు


పూజలందుకున్న దశభుజ మహా గణపతి

రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి దర్శనానికి స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

కూడేరు సొసైటీ చైర్మన్ రాజీనామా


రాజీనామా పత్రాన్ని చూపుతున్న వడ్డే గంగాధర్

కూడేరు: కూడేరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (సొసైటీ బ్యాంక్) చైర్మన్ కొర్రకోడు వడ్డే గంగాధర్ చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. ఆదివారం కూడేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాజీనామా పత్రాన్ని సొసైటీ బ్యాంక్ మేనేజర్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ రాజీనామా

బ్రహ్మసముద్రం : మండలంలోని భైరవానితిప్ప వ్యవసాయ సొసైటీ సంఘం అధ్యక్ష పదవికి, ఏడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ పదవికి నాగిరెడ్డిపల్లి రామాంజనేయులు ఆదివారం రాజీనామా చేశడు. రాజీనామా లేఖను ఏడీసీసీ బ్యాంక్ జిల్లా అధికారులకు అందించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో తాను రాజీనామా చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు సింగిల్ విండో డైరెక్టర్లు ఎంజీ సుమంగళమ్మ, మారెన్న కూడా రాజీనామా చేసినట్లు తెలిపారు.

వైభవంగా కల్కి అమ్మభగవాన్ కల్యాణోత్సవం


అమ్మ భగవాన్ కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డులోని కల్కి ఆలయంలో కల్కి అమ్మభగవాన్ కల్యాణోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కల్కి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భగవతి, భగవానుల చిత్రపటాలను అలకరించి, కల్యాణోత్సవ వేడుక జరిపించారు. వందలాది మంది భక్తులు హాజరుకాగా, కల్యాణోత్సవాన్ని జరిపారు. లోక కల్యాణార్థం ఏటా కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ సేవకులు జయంతి రమేష్, నరసింహప్రసాద్, ఎస్ఎల్‌వీ రాధాకృష్ణ, లతా, లలిత, గీతా లక్ష్మీ, కౌన్సిలర్ దేవరాజు, రాఘవేంద్ర తెలిపారు. అధిక సంఖ్యలో దంపతులు హాజరై సంతాన ప్రాప్తి, సంపూర్ణ ఆరోగ్యం కోసం పూజలు చేశారు. అనంతరం అమ్మభగవాన్ పల్లకీసేవ జరిపించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది.

బీటీ ప్రాజెక్టులోకి వరదనీరు


బీటీ ప్రాజెక్టుకు చేరుతున్న వరదనీరు

రాయదుర్గం/గుమ్మఘట్ట: నైరుతి రుతుపవనాలు రాయలసీమను తాకాయి. దీంతో ఆదివారం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ డివిజన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలోనూ విస్తారంగా వానలు కురుస్తుండడంతో దిగువనున్న బీటీ ప్రాజెక్ట్‌కు వరదనీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం సముద్ర మట్టానికి 1,655 అడుగులు కాగా, ఆదివారం 1,644.6 అడుగులకు నీరు చేరింది. 220 క్యూసెక్కులతో ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు సంబంధితశాఖ ఏఈ హరీష్ తెలిపారు. శనివారం రాత్రి డివిజన్ వ్యాప్తంగా 31.3 ఎంఎం వర్షం కురిసింది.

14న 'కోన'లో వేలం

తాడిపత్రిటౌన్: మండలంలోని ఆలూరు కోన రంగనాథస్వామి ఆలయంలో వాహనాల పార్కింగ్ రుసుం వసూలు చేయడానికి ఈ నెల 14న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 11న రూ.5000 డిపాజిట్ (డీడీ) చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. 14వ తేదీ ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.

వర్షం కురిసె..విత్తుకు వేళాయె

- ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు
- ఖరీఫ్ ప్రారంభం కావడంతో పొలం పనుల్లో రైతన్నల బిజీ


బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట వద్ద విత్తన సాగుకు సిద్ధంగా ఉంచిన పొలం

కళ్యాణదుర్గం: నియోజకవర్గంలో ఈ ఏడాది ముందస్తుగా కురిసిన వర్షాలకు రైతులు ముంగారు సేద్యాలు చేసి, సాగుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్ ప్రారంభంలోనే అదునులో పదునైన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా వేరుశనగ సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జూలై ఆఖరు వరకు విత్తన సాగు చేసుకునేందుకు అనుకూలమని వ్యవసాయాధికారులు తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 69,892 హెక్టార్లలో వేరుశనగ సాధారణ సాగు చేయనున్నట్లు చెప్తున్నారు.

ట్రాక్టర్ సేద్యాలకు రైతుల మొగ్గు..

విత్తన సాగుకు, ముంగారు సేద్యం పనులకు గతంలో కాడెద్దులు తప్పనిసరి. ప్రతి ఇంటా కాడెద్దులు ఉండేవి. అయితే రాను రానూ కాడెద్దులు కనుమరుగవుతున్నాయి. ధరలు పెరిగిపోయి, ఎద్లను పోషించలేని పరిస్థితి. రెడీమేడ్‌గా ట్రాక్టర్ సేద్యాలకు రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో ఎద్లకు, ట్రాక్టర్లకు గిరాకీ పెరిగింది. ఎకరం విత్తన సాగుకు, సేద్యం పనులకు ట్రాక్టర్, కాడెద్దులతో కూలి మనిషికి, గొర్రు,గుంటకు, ఇతర పనిముట్లకు పనిముట్లకు రూ. 3వేల నుంచి రూ.4 వేలు వరకు బాడుగలు చెల్లించాలి. ట్రాక్టర్ యజమానులు విత్తన సాగుకు గంటకు రూ.2వేల నుంచి రూ.2,500 వరకు అద్దె తీసుకుంటున్నారు. ఈ లెక్క ప్రకారం సగటున ఐదెకరాలు పొలంలో విత్తన సాగు చేయాలంటే సదరు రైతు విత్తనాలు, ఎరువులు, సేద్యం పనులకు సుమారుగా రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

కళ్యాణదుర్గం డివిజన్లో ఇప్పటి వరకు వేరుశనగ సాగు ఇలా..

మండలం	సాధారణ వేరుశనగ సాగు (హెక్టార్లలో)
బ్రహ్మసముద్రం	13,895
కళ్యాణదుర్గం	19,406
శెట్టూరు	11,402
కుందుర్పి	12,041
కంబదూరు	13,148
మొత్తం	69,892

జూలై ఆఖరి వరకూ సాగుకు అనుకూలం



ఖరీఫ్ సీజన్‌లో జూలై ఆఖరు వరకు వేరుశనగ విత్తుకోవచ్చు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా కురుస్తున్నాయి. తేమ ఆరిపోతుందనే ఆందోళన చెందకుండా రైతన్నలు సాగు చేసుకోవచ్చు. వేరుశనగతో పాటు ఇతర చిరుధాన్యాల పంటలు సాగు చేసుకోవచ్చు. రైతులకు అవసరమైన సందేహాలను నివృత్తి చేసేందుకు ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకేలలో వ్యవసాయ సిబ్బంది సిద్ధంగా ఉంటారు. వారి సేవలను రైతులు వినియోగించుకోవాలి.

– యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

విస్తారంగా ఆముదం సాగు

- ఉరవకొండలో 500 హెక్టార్లలో సాగుకు సిద్ధం


ఉరవకొండ పరిసరాల్లో ట్రాక్టర్‌తో ఆముదం విత్తుతున్న రైతు

ఉరవకొండ: వేసవి ముగిసింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. రైతులు పొలాల్లో ముంగారు సేద్యాలు చేసుకుని, సాగుకు సన్నద్ధమయ్యారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్నాయి. అదునులో పదును కావడంతో రైతన్నలు పంటల సాగులో బిజీ అయ్యారు. మండలంలోనూ,ఉరవకొండ పట్టణ పరిసరాలతో పాటు గ్రామాల్లో ఆముదం సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆముదం సాగు ఊపందుకుంది. మండలంలో ఖరీఫ్ పంట కాలంలో 15 వేల హెక్టార్లలో వివిధ పంటలు సాగవుతుండగా, 500 హెక్టార్లలో ఆముదం సాగు అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలో ఖరీఫ్ పంట సాగులో 10 వేల హెక్టార్లలో వేరుశనగ, 1,600 హెక్టార్లలో కంది, 1,100 హెక్టార్లలో మిరప, 500 హెక్టార్లలో ఆముదం, 400 హెక్టార్లలో వరి, 200 హెక్టార్లలో మొక్కజొన్నతో పాటు వివిధ రకాల పంటలు సాగవుతున్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ తెలిపారు.

చెరువులు, కుంటలకు జలకళ


ఉరవకొండ - చాబాల రహదారిలో నీటితో నిండిన ఫారంపాండ్


కూడేరులో ఓ వీధిలో పారుతున్న వర్షపునీరు

ఉరవకొండ: మండల వ్యాప్తంగా వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కంటలు నీటితో నిండాయి. షేక్షానుపల్లి, లత్తవరం, చిన్నహోతూరు, చాబాల, పొలికి తదితర గ్రామాల్లో రైతుల పొలాల్లో ఉపాధిహామీ పథకం కింద ఏర్పాటు చేసిన ఫారంపాండ్స్ వర్షపునీటితో నిండిపోయాయి. భారీ వర్షాలతో బావులు, బోరుబావులు, భూగర్భజలాలు పెరిగాయి. రైతులు ఉత్సాహంగా ఖరీఫ్ సాగు కోసం సమాయత్తమవుతున్నారు.

కూడేరులో జోరుగా వాన

కూడేరు: మండలంలో ఈదురు గాలులతో వర్షం జోరుగా కురిసింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు విడతలుగా వర్షం కురిసింది. గత 10 రోజుల నుంచి మోస్తరు వర్షాలు కురుస్తువచ్చాయి. ఆదివారం కురిసిన వానకు వంకల్లో వర్షపునీరు పారింది. చెక్‌డ్యాంలు, ఉపాధి హామీ పథకం కింద తవ్విన ఫారం పాండ్లు, డకౌట్ పాండ్లలోకి, చెరువుల్లోకి నీరు చేరింది. వర్షాలకు బీడు భూముల్లో పచ్చిగడ్డి మొలిచింది. పాడి పెంపకందారులు, పశుపోషకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పచ్చి గడ్డి తినడం ద్వారా పాల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కణేకల్లులో మోస్తరు వర్షం

కణేకల్లు: మండలంలో శనివారం రాత్రి, ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలను రైతులు ఇప్పటికే దుక్కులు చేసుకున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 2,700 క్వింటాళ్ల వేరుశనగ సబ్సిడీ ద్వారా అందించినట్లు ఏఓ శ్రవణ్‌కుమార్ తెలిపారు. జూలై 15 వరకు వేరుశనగ విత్తుకోవచ్చని తెలియజేశారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు


తీవ్రంగా గాయపడిన బసవరాజు

కళ్యాణదుర్గం: పట్టణ శివారులోని కంబదూరు బైపాస్ రోడ్డులో ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని, ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు.. పట్టణంలోని చైతన్య పాఠశాల కరస్పాండెంట్ చైతన్యబాబు కుమారుడు వెంకటకృష్ణ బైపాస్ నుంచి ద్విచక్ర వాహనంపై పాఠశాలలోకి వెళ్తున్నాడు. అదే సమయంలో యర్రంపల్లికి చెందిన బసవరాజు పట్టణంలోకి వెళ్తున్నాడు. ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటకృష్ణకు కుడికాలు విరిగింది. బసవరాజు తలకు, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి క్షీరాభిషేకం


అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకులు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు, మహా నైవేద్యం నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు.

పంపనూరులో భక్తుల సందడి


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు


ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

ఆత్మకూరు: పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొలుత పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో సుబ్రహ్మణ్యేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆకుపూజ అనంతరం స్వామికి మహా మంగళహారతి అందించారు. అంతేకాకుండా స్వామి బంగారు కవచాన్ని మేళతాళలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఆలయంలో కాలసర్పదోష నివారణకు రాహుకేతు హోమాలు చేశారు. అలాగే ఆలయంలో మంజునాథ స్వామి, పార్వతి దేవికి ప్రత్యేక పూజలు జరిగాయి. వేసవి సెలవులు కావడంతో ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. భక్తులు మొక్కుబడిగా ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేశారు. స్వామి దర్శనానికి గంటల సమయం పట్టింది. భక్తులకు ఆలయంలో తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అన్నదాతను 'వరి'ంచిన ధర

- ఆర్‌ఎన్‌ఆర్ రకం వరికి మార్కెట్లో డిమాండ్
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


రైతులు పండించిన వరిధాన్యం

గుమ్మఘట్ట: ఆరుగాలం కష్టించి పండించిన వరి పంటకు బహిరంగ మార్కెట్‌లో ఆశాజనకంగా ధరలు ఉండడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బీకేల్లోని వ్యవసాయ సిబ్బంది రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు ఇచ్చారు. నాణ్యమైన విత్తనాలు, రసాయ మందులు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉంచారు. దీంతో ఆశించిన దిగుబడి వచ్చిందని, ధర కూడా అదే స్థాయిలో ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని గుమ్మఘట్ట, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, కణేకల్లు, రాయదుర్గం మండలాల వ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సీజన్‌లో 4,756 హెక్టార్లలో ఆర్‌ఎన్‌ఆర్, బీపీటీ రకాల వరి పంట సాగు చేశారు. ఎకరాకు 35 బస్తాల నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. ఆర్‌ఎన్‌ఆర్ రకానికి ప్రస్తుత మార్కెట్‌లో కోత ప్రారంభంలో క్వింటా రూ.2500 నుంచి రూ.2600 వరకు ధరలు పలుకగా, ప్రస్తుతం రూ.2700 ధర పలుకుతోంది.

4 ఎకరాలలో వరి సాగు చేశా



మాకున్న నాలుగు ఎకరాల్లో ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి పంట సాగు చేశా. 126 బస్తాల వరి ధాన్యం పండింది. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు ఆర్‌ఎన్‌ఆర్ సోనా రకం సాగు చేశాం. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టాం. గతంలో వరి ధరలు తక్కువగా ఉండేవి. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండడంతో పంట దిగుబడి తగ్గినా ధర ఆశించిన స్థాయిలో ఉంది.

– గొల్ల ఈరన్న, బీటీపీ గ్రామం

వరి ధాన్యం ధర పెరిగింది



వ్యవసాయ బోరుబావుల కింద ఆరు ఎకరాల్లో వరి పంట సాగు చేశాం. 246 బస్తాల దిగుబడి వచ్చింది. ఎకరాకు 41 బస్తాలు దిగుబడి వచ్చింది. గత రబీ సీజన్‌లో క్వింటా రూ.2100కు విక్రయించాం. రబీ సీజన్‌లో ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి సాగు చేయగా క్వింటా రూ.2500 నుంచి రూ.2600 వరకు కళ్లంలోనే విక్రయించాం. గతేడాదితో పోలిస్తే ఈ సారి ధర పెరిగింది.

– గోవిందరెడ్డి, రైతు, కలుగోడు గ్రామం

నమాజ్‌తో మానసిక ప్రశాంతత


ప్రసంగిస్తున్న మహిళా ముల్లిమాలు

అనంతపురం కల్చరల్: ప్రతి బిడ్డ అమ్మ ఒడి ప్రథమ పాఠశాలగా జ్ఞానాన్ని సంపాందించుకుంటుందని పలువురు మహిళా ముఅల్లిమాలు అన్నారు. ఆదివారం తెహరికె ఫైజానే ఉమర్ ఫారూఖ్ వారి ప్రథమ వార్షిక మహిళా సున్ని ఇజ్‌తెమా ఘనంగా జరిగింది. తెహరీక్ అధ్యక్షుడు హజరత్ హసన్ రజాఖాద్రి నేతృత్వంలో స్థానిక రాణినగర్‌లోని బహమీ బైతుల్ మాల్ షాదీ మహల్ వేదికగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళా ముల్లిమాలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రసంగించారు. ప్రతి స్త్రీ కుటుంబం మంచి మార్గంలో నడవడానికి తన శక్తియుక్తులన్నీ వినియోగిస్తుందన్నారు. బిడ్డల సత్ప్రవర్తన తల్లితోనే సాధ్యమని వెల్లడించారు. రోజూ ఐదు సార్లు నమాజ్ చేస్తే మానసిక ప్రశాంతత తోడై ఉన్నత జీవితం అనుభవించడానికి సాధ్యమవుతుందన్నారు. పవిత్ర ఖురాన్‌లోని ముఖ్య విషయాలను ప్రతి స్త్రీ తాను నేర్చుకుని.. బిడ్డలను ఆ బాటలో నడిపించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మధ్యాహ్నం ప్రత్యేక వసతులతో పాటూ భోజన సౌకర్యం కల్పించారు. ఇకపై ప్రతి ఏటా మహిళా ఇజ్‌తెమా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మసీద్ ముతవల్లి ఫరుదీద్దున్, సెక్రటరీ పర్వీష్, షబ్బీర్ అహమద్, అబ్దుల్ సమీ, హబీబ్, డాక్టర్ షఫీ, ఆరిఫ్, చాంద్ బాషా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైతుతోనే సమాజ ప్రగతి


గోపాలరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: రైతు జీవితమే సమాజ ప్రగతి సాధ్యమని జనప్రియ కవి ఏలూరు యంగన్న అన్నారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రముఖ రచయిత మార్తాటి ఈశ్వరీ గోపాలరావు రచించిన 'రైతే మా రాజు' పుస్తకావిష్కరణ జరిగింది. స్థానిక ఎన్జీవో హోమ్‌లో జరిగిన కార్యక్రమానికి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. యంగన్న కవితో పాటూ పుస్తక సమీక్షకుడు రాజారామ్, ప్రముఖ రంగస్థల నటుడు సి.రాము ఆత్మీయ అతిథులుగా హాజరై, మాట్లాడారు. కావ్యం నిండా నిరంతరం కష్టపడే రైతు జీవితం, మట్టి వాసన, పల్లెటూరు సోయగాలు, రైతుతో ముడిపడిన వ్యవసాయ ప్రాధాన్యత కనపడతాయన్నారు. అందరూ చదవదగిన కావ్యంగా అభివర్ణించారు. రైతు నూతన సాంకేతిక వ్యవసాయంలో నవీన పద్ధతులు పాటించాలని రచయిత కోరుకున్నారని తెలిపారు. రైతే మారాజు కావ్యంలో పశు సంపదే దేశ సంపదగా కవి కీర్తించారని గుర్తు చేశారు. అనంతరం కవి మార్తాటి గోపాలరావు దంపతులను పలువురు రచయితలు, కవులు ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ప్రజాగాయకుడు దాసరి ఆదినారాయణ ఆలపించిన ఉద్దీపన గీతం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర, సీనియర్ రచయితలు తరిమెల అమరనాథరెడ్డి, గోవిందరాజులు, టీవీరెడ్డి, అశ్వర్థరెడ్డి, కృష్ణమూర్తి, ఎస్ఎం బాషా, పూజారి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

మనోధైర్యంతో ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ వినూత్న

అనంతపురం మెడికల్: హిమోఫీలియాతో బాధపడుతున్న వారు మనోస్థైర్యాన్ని కోల్పోకుండా ముందుకెళ్లాలి. తల్లిదండ్రులు ఆ దిశగా పిల్లల్లో ధైర్యం నింపాలని అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ వినూత్న పేర్కొన్నారు. ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) హాల్‌లో హిమోఫీలియా బాధితులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హిమోఫిలియాతో బాధపడే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అందుకు సంబంధించిన మందులు పుష్కలంగా ఉన్నాయని గుర్తు చేశారు. ప్రధానంగా జీవితంలో ప్రతి ఒక్కరూ పాజిటివ్ దృక్పథంతో ముందుకెళ్లాలన్నారు. ప్రభుత్వ పరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఎప్పుడు అందుబాటులో ఉంటుందన్నారు. డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీని (ఎమర్జెన్సీ) ఎమర్జెన్సీ మెడిసిన్‌గా మార్చుతున్నట్లు వెల్లడించారు. హిమోఫీలియా బాధితులకు అక్కడే ఫ్యాక్టర్ ఇంజెక్షన్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌టాస్ ఫౌండేషన్ ప్రతినిధులు రామకృష్ణ, నారాయణస్వామి, శ్యాంసుందర్, కృష్ణమూర్తి, గణేష్, చిక్కన్న, తదితరులు పాల్గొన్నారు.

మెరుగ్గా అల్ట్రాసౌండ్ సేవలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని రేడియాలజీ విభాగంలో రోగులకు మెరుగ్గా అల్ట్రాసౌండ్ సేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో అల్ట్రాసౌండ్ సెంటర్‌లో రోజూ 80 మందికి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 20 మందికి పైగా రోగులకు అల్ట్రాసౌండ్ సేవలు అందిస్తున్నారు. జీజీహెచ్‌లోని సెంటర్‌లో మూడు స్కానింగ్ మిషన్లు ఉన్నాయి. అందులో అసిస్టెంట్ ప్రొఫెసర్లతో పాటు, పీజీలు ఉదయం నుంచి సాయంత్రం వరకు స్కాన్‌లు చేస్తున్నారు. ఆస్పత్రిలోని గైనిక్, చిన్నపిల్లల, ఐసీసీయూ, ఆర్థో, చెస్ట్, సర్జరీ, ఏఎంసీ, ఎంఎం, ఎఫ్ఎం తదితర వార్డుల నుంచి రోగులకు అబ్‌డామిన్, పెల్విస్, ఛాతి, పసికందులకు బ్రెయిన్, మోకాళ్లు, కంటికి స్కాన్ చేసి రిపోర్టులు అందజేస్తున్నారు. ఇటువంటి స్కాన్ చేయాలంటే ఒక్కోరికి రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు ఖర్చు అవుతుంది. అటువంటి ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉచితంగా అల్ట్రాసౌండ్ స్కాన్ చేస్తుండటంపై రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.